హైదరాబాదీ దంపతులకు రూ.10 వేలు చెల్లించండి

ఇండిగో ఎయిర్‌లైన్స్‌కు కమిషన్ ఆదేశం

సిటీబ్యూరో, జూలై 10 (నమస్తే తెలంగాణ): హైదరాబాదీ దంపతులకు నష్టపరిహారంగా ఇండిగో ఎయిర్‌లైన్స్ రూ.10వేలు చెల్లించాలని జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ బుధవారం ఆదేశించింది. 2021లో హైదరాబాద్ నుంచి బెంగళూరుకు విమానంలో వెళ్లిన దంపతులకు చేదు అనుభవం ఎదురైంది. ఆ విమానంలో అపరిశుభ్ర వాతావరణం, ప్లాస్టిక్ బాటిళ్లు, దుర్వాసన వెదజల్లే చెత్త ఉండటంతో ఆ ప్రయాణం వారికి అనారోగ్యాన్ని కలిగించిందంటూ ఆ దంపతులు వినియోగదారుల సేవా కేంద్రాన్ని ఆశ్రయించారు. ఈ ప్రయాణంలో తన భార్య వికారం, వాంతులతో బాధపడిందని ఫిర్యాదుదారు డి.రాధాకృష్ణ సేవా కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. విచారణ జరిపిన కమిషన్.. బాధితులకు రూ.10వేలు చెల్లించాలని ఇండిగో ఎయిర్‌లైన్స్‌ను ఆదేశించింది. 45 రోజుల్లో నష్టపరిహారం చెల్లించాలని పేర్కొంది. గడువు ముగిస్తే 12 శాతం వడ్డీతో చెల్లించాలని హెచ్చరించింది. కాగా, ఇటీవల ఓ నగరవాసికి ఇండిగో ఎయిర్‌లైన్ టికెట్ రద్దు చేసినట్టు సమాచారం ఇవ్వకపోవడంతో కమిషన్‌ను ఆశ్రయించాడు. ఈ కేసులో రూ.30వేలు చెల్లించాలని కమిషన్ తీర్పునిచ్చిన విషయం తెలిసింది. ఇదిలా ఉండగా.. ఫ్లైట్‌లో ప్రయాణం వల్ల అనారోగ్య సమస్యలు వచ్చాయని ఫిర్యాదు దారుడు తమకు తెలపలేదని ఇండిగో ఎయిర్‌లైన్స్ ఆరోపించడం విశేషం.

క్యాన్సర్‌ను జయించాలంటే.. వ్యాధిని గుర్తించాలి

సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి

సిటీబ్యూరో, జూలై 10 (నమస్తే తెలంగాణ): క్యాన్సర్‌ను జయించాలంటే వ్యాధిని ముందస్తుగా గుర్తించడం ఒక్కటే మార్గమని సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాశ్ మహంతి అన్నారు. గ్రేస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'గ్రేస్ క్యాన్సర్ రన్ -2024'కు సంబంధించిన బ్రోచర్‌ను కమిషనరేట్‌లో సీపీ ఆవిష్కరించారు. క్యాన్సర్ బాధితులను ఆదుకునేందుకు అక్టోబర్ 6న ప్రపంచ వ్యాప్తంగా 130 దేశాల్లో లక్ష మందితో క్యాన్సర్ రన్‌ను నిర్వహించనున్నట్లు గ్రేస్ ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. భౌతికంగా, ఆన్‌లైన్ ద్వారా నిర్వహించే ఈ రన్ ప్రపంచంలోనే అతి పెద్ద రన్‌గా నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ (ట్రాఫిక్) జోయల్ డెవీస్ తదితరులు పాల్గొన్నారు.

బాదుడే.. బాదుడు!

వివాదమవుతున్న సిటీ పోలీసుల వైఖరి

ఓయూలో నిరుద్యోగులు, జర్నలిస్టులపై దౌర్జన్యం

సిటీబ్యూరో, జూలై 10 (నమస్తే తెలంగాణ): నగర పోలీసులు సాగిస్తున్న దౌర్జన్యకాండపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. సిటీ పోలీసుల వ్యవహార శైలిపై సోషల్ మీడియాలోనూ చర్చ జరుగుతోంది. డీఎస్సీని వాయిదా వేయాలంటూ కోరుతూ ఉస్మానియా యూనివర్సిటీలో నిరసన దీక్ష చేస్తున్న అభ్యర్థులతో పాటు వారికి మద్దతు తెలుపుతున్న విద్యార్థి యూనియన్లు, కవరేజీకి వెళ్లిన జర్నలిస్టులను పోలీసులు చితకబాదుతున్నారు. తెలంగాణ ఉద్యమంలో ఉమ్మడి రాష్ట్ర పోలీసులు తెలంగాణవాదులపై సాగించిన దౌర్జన్యకాండ తిరిగి నేడు ఉస్మానియా యూనివర్సిటీలో రిపీట్ అవుతున్నదని నిరుద్యోగ యువకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో.. ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా నిరసన చేస్తున్న వారిపై పోలీసులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ లాఠీలకు పనిచెబుతున్నారని, అడ్డొచ్చిన వారిపై విరుచుకుపడుతున్నారంటూ విద్యార్థులు మండిపడుతున్నారు. అలాగే, బోనాల ఏర్పాట్లు కూడా సక్రమంగా చేయలేక.. పోలీసులు భక్తులను సైతం ఇబ్బందులకు గురిచేస్తున్నారు. బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం వచ్చిన భక్తుల రద్దీకి అనుగుణంగా పోలీసులు తగిన ఏర్పాట్లు చేయలేదు. ఏకంగా రాష్ట్ర మంత్రి సైతం పోలీసుల వైఖరిని నిలదీశారు. అలాగే, ప్రతి ఏడాది అమ్మవారి కల్యాణానికి హాజరయ్యే జోగినీలను సైతం పోలీసులు అడ్డుకొని ఇబ్బందులకు గురి చేశారు. గతేడాది వేడుకలు ఎలా చేశారు.. ఈసారి ఎలా చేస్తున్నారంటూ.. పోలీసుల తీరుపై ఓ జోగిని మండిపడటం సోషల్‌మీడియాలో వైరల్ అయ్యింది. ప్రభుత్వాలు మారినంత మాత్రాన నిర్వాహకులు, పోలీసులు ఇంత అధ్వానంగా భక్తులకు ఏర్పాట్లు చేస్తారా.? అంటూ నిలదీశారు. ఇలా హైదరాబాద్ పోలీసులు వేడుకల నిర్వాహణ సరిగ్గా చేయలేక పోతున్నారని, నిరసన తెలిపేందుకు వెళ్లే వారిపై ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ దమనకాండ సాగిస్తున్నారంటూ వస్తున్న ఆరోపణలు వివాదమవుతున్నాయి. ఇటీవల టీజీపీఎస్సీని ముట్టడించిన సమయంలో కూడా పోలీసులు నిరుద్యోగ యువతపై లాఠీలు ఝుళిపించి, కనిపించిన వారిని అరెస్ట్ చేశారు. అలాగే, విద్యాశాఖ డైరెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న వారిని అరెస్ట్ చేశారు. నిరుద్యోగ యువత పోలీసుల కాళ్లు పట్టుకున్నా.. కనికరం చూపలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మీడియాపై విరుచుపడుతున్న పోలీసులు..

ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడొద్దు.. మేం అనుకున్నదే చేస్తాం.. మీకేమి పనిలేదా.. ఎందుకు ఇదంతా కవరు చేస్తున్నారు.. అంటూ ఉస్మానియా యూనివర్సిటీలో మీడియాపై పోలీసులు విరుచుకుపడుతున్నారు. జీ న్యూస్ రిపోర్టర్‌పై స్థానిక పోలీసులు దౌర్జన్యం చేయడాన్ని జర్నలిస్టు సంఘాలు తీవ్రంగా ఖండించాయి. పోలీసులకు వ్యతిరేకంగా ఆందోళన చేశాయి. విలేకరిపై ఎందుకు దౌర్జన్యం చేశారంటూ మరో విలేకరి స్థానిక ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌ను ప్రశ్నించడంతో.. మీకేం పనిలేదా.. మీ వల్లే ఇదంతా.. అంటూ మండిపడ్డారు. మంగళవారం స్థానిక ఏసీపీ కూడా ఇదే విధంగా స్పందించారు. మీడియా వల్లే ఇదంతా జరుగుతున్నదంటూ.. మాట్లాడారు. మీడియా రాకపోతే ఇక్కడ జరుగుతున్న ఘటనలు సమాజానికి తెలియవంటూ పోలీసులు పేర్కొంటూ.. మీడియాపై ఉక్కుపాదం మోపుతున్నారు. గత వారం కూడా గాంధీ దవాఖాన వద్ద పోలీసులు మీడియాపై ఇదే విధంగా వ్యవహరించి, తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నారు.

సంరక్షకుడే హత్య చేశాడు

కమ్మదనం ఫాంహౌస్‌లో రియల్టర్ హత్య

షాద్‌నగర్, జూలై 10 : యజమాని రక్షణ చూసుకోవాల్సిన సంరక్షకుడే హత్య చేశాడు. ఈ దారుణం రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం గ్రామ పంచాయతీ పరిధిలోని ఓ ఫాంహౌజ్‌లో బుధవారం సాయంత్రం చోటు చేసుకున్నది. షాద్‌నగర్ పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని హైదర్షకోట్ ప్రాంతానికి చెందిన కమ్మరి కృష్ణ (57) రియల్ ఎస్టేట్‌తో పాటు ఇతర వ్యాపారాలు చేశాడు. కొన్నేళ్ల కిందట కమ్మదనం గ్రామ పంచాయతీ పరిధిలోని వ్యవసాయ భూమిలో ఫాంహౌజ్‌ను నిర్మించుకొని, కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నాడు. రోజువారీ మాదిరిగానే కమ్మరి కృష్ణ వ్యక్తిగత బాడీగార్డు బాబాతో కలిసి సాయంత్రం 5.30 గంటల సమయంలో టీ తాగారు. ఆ తర్వాత బాబాతో పాటు మరో ముగ్గురు కలిసి కృష్ణపై కత్తితో దాడిచేసి తీవ్రంగా గాయపర్చారు. కుటుంబ సభ్యులు గమనించి.. తీవ్రంగా గాయపడిన కృష్ణను శంషాబాద్‌లోని ప్రైవేట్ దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, షాద్‌నగర్ పట్టణ సీఐ విజయ్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. స్థానికుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కృష్ణ వద్ద బాడీ గార్డుగా పనిచేసే బాబానే ఈ హత్యకు పాల్పడినట్లు తెలుస్తున్నదని ఏసీపీ రంగస్వామి తెలిపారు. హత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదన్నారు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి వివరాలను వెల్లడిస్తామని చెప్పారు. హత్య చేసిన అనంతరం దుండగులు కారులో పారిపోయారని, హత్యకు గల కారణాలు తమకు కూడా తెలియవని మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు.

స్కూల్ వాహనాలపై స్పెషల్ డ్రైవ్

నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలపై 9 వేల కేసులు

సిటీబ్యూరో, జూలై 10 (నమస్తే తెలంగాణ): పాఠశాల విద్యార్థులను సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేర్చాలని ఆటోలు, వ్యాన్, బస్సు డ్రైవర్లకు హైదరాబాద్ పోలీసులు సూచించారు. ఇందులో భాగంగా గత నెల 27వ తేదీ నుంచి నగర పోలీసులు నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్‌లో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 8,930 కేసులు నమోదు చేసినట్లు ట్రాఫిక్ అదనపు సీపీ విశ్వప్రసాద్ తెలిపారు. ఆర్టీఏతో సమన్వయం చేసుకుంటూ.. ఉదయం 7.30 నుంచి 9.30, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ డ్రైవ్ కొనసాగిస్తున్నట్లు తెలిపారు. 15 రోజుల వ్యవధిలో నమోదైన కేసుల్లో 691 మంది వద్ద డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడంతో కేసులు నమోదు చేశామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను స్కూల్‌కు పంపించే వాహనాల డ్రైవర్లకు లైసెన్స్ ఉందా.! వాహన పత్రాలు ఉన్నాయా.! అనే విషయాలు పరిశీలించాలని సూచించారు.

ఏసీపీ ఉమామహేశ్వరరావుకు బెయిల్

నాంపల్లి కోర్టులు, జూలై 10 (నమస్తే తెలంగాణ): సీసీఎస్, డీడీ ఏసీపీ ఉమామహేశ్వరరావుకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ బుధవారం ఏసీబీ కోర్టు జడ్జి అఫ్రోజ్ ఉత్తర్వులు జారీ చేశారు. రూ.50 వేలు చొప్పున ఇద్దరి జమానత్‌లను కోర్టుకు సమర్పించాలని పేర్కొన్నారు. ప్రతి శుక్రవారం ఏసీబీ అధికారుల ఎదుట హాజరుకావాలని షరతు విధించారు. సాక్షులను ప్రభావితం చేయకూడదని, దేశం విడిచి వెళ్లకూడదని, విచారణ అధికారులకు సహకరించాలని ఆదేశించారు. జమానత్‌లను కోర్టుకు సమర్పించిన తర్వాత గురువారం విడుదలవుతారు.

సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ శ్రీనివాస్

విశ్రాంత ఐపీఎస్ ఇంట్లో చోరీ

నిందితుడి అరెస్టు..100 తులాల బంగారం స్వాధీనం

వివరాలు వెల్లడించిన డీసీపీ శ్రీనివాస్

బండ్లగూడ, జూలై 10: విశ్రాంత ఐపీఎస్ ఇంట్లో దాదాపు కోటి రూపాయల విలువజేసే బంగారం నగలు ఎత్తుకెళ్లిన కేసులో నార్సింగి పోలీసులు దొంగను అరెస్టు చేశారు. ఈ కేసు వివరాలను రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ వెల్లడించారు. గంధంగూడలో ఉంటున్న రిటైర్డ్ ఐపీఎస్ రవిబాబు ఈ నెల 3వ తేదీన కుటుంబసభ్యులతో కలిసి విజయవాడకు వెళ్లారు. తిరిగి 9వ తేదీ అర్ధరాత్రి ఇంటికి వచ్చారు. ఇంట్లోకి వెళ్లి మూడగా బీరువా తాళం పగలగొట్టి ఉండటంతో పాటు వస్తువులు అన్ని చిందరవందరగా పడి ఉన్నాయి. దీంతో రవిబాబు పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. లభించిన ఆధారాలతో గంధంగూడ రాజీవ్‌గృహకల్పకు చెందిన ప్రవీణ్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. ప్రవీణ్ దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. అతడి వద్ద నుంచి వంద తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్టు డీసీపీ పేర్కొన్నారు.

భవనం పైనుంచి దూకిన విద్యార్థి

చికిత్స కోసం ఆస్పత్రికి తరలింపు

దర్యాప్తు చేస్తున్న పేట్ బషీరాబాద్ పోలీసులు

కుత్బుల్లాపూర్, జూలై 10: అనుమానాస్పద స్థితిలో ఓ విద్యార్థి గడ్డి మందు తాగి, ఆపై తాను ఉంటున్న వసతిగృహం భవనం పైనుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం మధ్యాహ్నం జరిగింది. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. వరంగల్‌కు చెందిన హరినాథ్ మైసమ్మగూడలోని మల్లారెడ్డి అగ్రికల్చర్ యూనివర్సిటీలో మూడో సంవత్సరం చదువుతూ.. అక్కడే ఉన్న ఓ ప్రైవేట్ వసతి గృహంలో ఉంటున్నాడు. అయితే, బుధవారం మధ్యాహ్నం సమయంలో వసతి గృహంలో ఉన్న గడ్డి మందు తాడి, ఆ తర్వాత తాను ఉంటున్న వసతిగృహం భవనంపైకి ఎక్కి కిందకు దూకాడు. కింద కరెంటు వైర్లు ఉండటంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన కొంపల్లిలోని శ్రీకర ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, అన్ని కోణాల్లో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

బోధకాలు నివారణపై..

ఉస్మానియాలో వైద్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం

సిటీబ్యూరో, జూలై 10 (నమస్తే తెలంగాణ): బోధకాలు వ్యాధి నివారణపై ఉస్మానియా దవాఖానలోని ప్లాస్టిక్ సర్జరీ విభాగం ఆధ్వర్యంలో ఓటీ, వార్డులకు చెందిన సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ సర్జరీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ పలుకూరి లక్ష్మి మాట్లాడుతూ.. పుట్టుకతో లింపటిక్స్ లోపం వల్లగాని, లేదా దోమ కాటు వల్లగాని బోధకాలు వ్యాధి వస్తుందని తెలిపారు. బోధకాలు వ్యాధికి సంబంధించి అందుబాటులో ఉన్న అత్యాధునిక వైద్య పద్ధతులైన లింపొనోడ్ ట్రాన్స్‌ఫర్, లింప్‌వెజిల్ అనస్టామొసిస్, సూపర్ మైక్రోసర్జరీ.. తదితర వాటిపై ప్లాస్టిక్ సర్జరీ విభాగంలోని ఆపరేషన్ థియేటర్, వార్డుల్లో విధులు నిర్వర్తించే సిబ్బందికి అవగాహన కల్పించారు. అంతేకాకుండా.. బోధకాలు వ్యాధి నివారణ, వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలు తదితర అంశాలను వివరించారు.

లేని స్థలానికి పత్రాలు సృష్టించి..

విక్రయించేందుకు యత్నించిన ఇద్దరి అరెస్ట్

వివరాలు వెల్లడించిన డీసీపీ శ్రీనివాస్

బండ్లగూడ, జూలై 10: ఫోర్జరీ డాక్యుమెంట్లను సృష్టించి ఇతరుల స్థలాన్ని విక్రయించేందుకు యత్నించిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు వివరాలను రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ వెల్లడించారు. బహదుర్‌పూరకు చెందిన ముఖరం దిన్‌ఖాన్, ఫైనాన్సర్ అశ్వక్ ఖాన్ కలిసి ఉప్పర్‌పల్లి సర్వే నంబర్ 78లో 3600 గజాల స్థలం ఉన్నట్లు (లేని స్థలం ఉన్నట్లుగా) యాకుత్‌పురకు చెందిన నవాబ్ అక్బరుద్దీన్ ఖాన్ పేరుతో ఫోర్జరీ డాక్యుమెంట్లను సృష్టించారు. అనంతరం అతడు మరో ముగ్గురికి గిఫ్ట్ డీడ్ చేసినట్లుగా పత్రాలను సృష్టించారు. అంతే కాకుండా.. అందులో నుంచి రోడ్డు పోతున్నట్లుగా 3600 గజాల స్థలానికి టీడీఆర్ తీసుకున్నట్లు చూపారు. ఆ స్థలానికి ఏమి లేకున్నా.. అన్ని ఉన్నట్లుగా పత్రాలను సృష్టించారు. అయితే, ఉప్పర్‌పల్లికి చెందిన సందీప్‌రెడ్డి అదే గ్రామంలోని సర్వే నంబర్ 43, 44, 46లో తనకు 3 ఎకరాల 8 గంటల స్థలం ఉన్నదని, కొందరు నకిలీ పత్రాలను సృష్టించి తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితులు సృష్టించిన నకిలీ డాక్యుమెంట్‌లో సర్వేనంబర్ 78లో వారి స్థలం ఉన్నట్టు చూపించి.. ఆ స్థలాన్ని విక్రయించే ప్రయత్నంలో మాత్రం సర్వే నంబర్ 43, 44, 46లో భూమిని చూపిస్తున్నారు. పోలీసులు దర్యాప్తులో అసలు నిందితులు ముఖరం దిన్‌ఖాన్, ఫైనాన్సర్ అశ్వక్‌ఖాన్‌గా గుర్తించి అరెస్ట్ చేశారు.

భూ వివాదంలో వేధింపులు

దుండిగల్ సీఐకి లెటర్‌రాసి

అదృశ్యమైన బౌరంపేట నివాసి మాధవరెడ్డి

ఆవేదనతో మృతిచెందిన మాధవరెడ్డి తండ్రి

దుండిగల్, జూలై 10: గ్రామంలో తనకు ఉన్న వ్యవసాయ భూమిని దౌర్జన్యంగా లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నారంటూ పోలీసులకు లేఖ రాసిన ఓ వ్యక్తి ఇంట్లో నుంచి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. బౌరంపేట గ్రామానికి చెందిన మాధవరెడ్డి కుటుంబానికి దొమ్మర పోచంపల్లి గ్రామంలోని సర్వేనంబర్ 188లో తన పూర్వీకుల నుంచి సంక్రమించిన 1.13 ఎకరాల భూమి ఉంది. దాని చుట్టపక్కల ఉన్న భూములను గత 20 ఏండ్ల క్రితమే నిజాంపేటకు చెందిన కార్పొరేటర్ మేకల వెంకటేశం కొనుగోలు చేశాడు. ఇటీవల త్రిపుర ల్యాండ్‌మార్క్ నిర్మాణ సంస్థకు డెవలప్‌మెంట్‌కు ఇచ్చారు. మధ్యలో ఉన్న మాధవరెడ్డి భూమిని తక్కువ ధరకు కొట్టేసేందుకు త్రిపుర ల్యాండ్ మార్క్ నిర్మాణ సంస్థ ఎండీ, పసుపులేటి సుధాకర్ ప్రయత్నించడంతో మాధవరెడ్డి ససేమిరా అన్నాడు. దీంతో మధవరెడ్డిపైకి గ్రామస్తులను ఉసిగొలిపారు. వారు గొడవ చేశారు. తీవ్ర మనస్తాపానికి గురైన మాధవరెడ్డి దుండిగల్ సీఐకు లెటర్ రాసి సోమవారం ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. మంగళవారం ఉదయం ఆయన గదిలో లెటర్ లభించింది. మాధవరెడ్డి భార్య పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసును రెండు రోజుల పాటు వెలుగులోకి రాకుండా యత్నించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మాధవరెడ్డి తన సెల్‌ఫోన్‌ను సైతం ఇంట్లోనే వదిలివెళ్లడంతో అతడు ఎక్కడ ఉన్నాడనేది కనుక్కోవడం ఇబ్బందికరంగా మారింది.

లేఖలో సంచలన విషయాలు..

త్రిపుర ల్యాండ్‌మార్క్ ఎండీ పసుపులేటి సుధాకర్, కార్పొరేటర్ వేధింపులు తాళలేక దుండిగల్ సీఐ శంకరయ్యకు మాధవరెడ్డి రాసిన లేఖలోని అంశాలు వెలుగులోకి వచ్చాయి. తాను ఈ భూ వివాదంతో మానసికంగా పూర్తిగా విసిగిపోయానని, పోలీసులకు ఎన్నిసార్లు విన్నవించినప్పటికీ తనకు న్యాయం జరగలేదంటూ పేర్కొన్నాడు. సోమవారం తనను పిలిపించుకున్న కార్పొరేటర్, పసుపులేటి సుధాకర్, కొందరు గ్రామస్తులు కలిసి మానసికంగా వేధించినట్టు వివరించాడు. కొందరైతే బూతులు తిట్టారని ఆవేదన వ్యక్తం చేశాడు. దీంతో తాను ఇంటిని విడిచి వెళ్లిపోతున్నానంటూ లేఖలో రాశాడు. తన కుటుంబాన్ని కాపాడాలని పోలీసులను కోరారు. అమ్మా,నాన్న, భార్యా పిల్లలు తనను క్షమించాలని వేడుకున్నాడు. తనను ఇబ్బంది పెట్టిన నిజాంపేట కార్పొరేటర్ మేకల వెంకటేశం, త్రిపుర ల్యాండ్ మార్క్ యజమాని పసుపులేటి సుధాకర్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలంటూ.. లెటర్ రాసి ఇంటి నుంచి వెళ్లిపోయాడు.

ఇరువర్గాలపై కేసు నమోదు..

భూ వివాదంలో రెండు నెలల కిందటే ఇరువర్గాలపై దుండిగల్ పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ కేసులో15 రోజుల పాటు మాధవరెడ్డి జైలు శిక్ష అనుభవించి, కండీషన్ బెయిల్‌పై బయటకు వచ్చాడు. ఇదే కేసులో పోలీసుల నుంచి తప్పించుకున్న పసుపులేటి సుధాకర్‌రెడ్డి, తదితరులకు మాత్రం ముందస్తు బెయిల్ లభించింది.

ఆగిన తండ్రి ఊపిరి...

రియల్టర్ల వేధింపులతో ఇంట్లో నుంచి కొడుకు వెళ్లిపోవడంతో మాధవరెడ్డి తండ్రి కృష్ణారెడ్డి (70) తీవ్రమానసిక వేదనకు గురయ్యాడు. రెండు రోజులుగా కొడుకు ఆచూకీ లభించక పోవడంతో కృష్ణారెడ్డి బుధవారం ఉదయం గుండెనొప్పితో మరణించినట్లు కుటుంబసభ్యులు పేర్కొన్నారు. అతడి అంత్యక్రియలను గురువారానికి వాయిదా వేశారు. అప్పటివరకైనా మాధవరెడ్డి వస్తాడనే ఆశ అందరిలో నెలకొందని గ్రామస్తులు పేర్కొన్నారు.

పోలీసులు సంపన్నులకే వత్తాసు పలుకుతున్నారని, ల్యాండ్‌మార్క్ యజమానిని అరెస్ట్ చేయకుండా.. అతడికి ముందస్తు బెయిల్ వచ్చేందుకు సహకరించారన్న ఆరోపణలు బలంగా వినిపించాయి. మాధవరెడ్డికి ఏదైనా జరిగితే పూర్తి బాధ్యత ల్యాండ్‌మార్క్ యజమాని పసుపులేటి సుధాకర్, నిజాంపేట కార్పొరేటర్ మేకల వెంకటేశం బాధ్యత వహించాలని కుటుంబసభ్యులు పేర్కొన్నారు.

ఆర్టీసీ క్రాస్ రోడ్డులో అగ్ని ప్రమాదం

చిక్కడపల్లి, జూలై 10: ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని శ్రీదత్త సాయి కమర్షియల్ కాంప్లెక్స్‌లో బుధవారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. పోలీసులు, ఫైర్ సిబ్బంది సకాలంలో స్పందించారు. ఎలాంటి ప్రాణహాని జరగలేదు. కాంప్లెక్స్‌లోని ఫ్లాట్ 202, మరో ఫ్లాట్‌లో ఉన్న టప్పర్ వేర్ గోదాంలో బుధవారం రాత్రి 7 గంటల సమయంలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. ఆ గోదాంలో ప్లాస్టిక్ ఐటమ్స్‌కు ఉండటంతో ఆ ప్రాంతమంతా మంటలు, పొగతో నిండిపోయింది. కాంపెక్స్‌లో ఉన్న వారంతా సురక్షితంగా బయటపడ్డారు. ఆరు ఫైర్ ఇంజన్లతో 4 గంటల్లో మంటలను అదుపు చేశారు. చిక్కడపల్లి ఏసీపీ రమేశ్ కుమార్, ఇన్‌స్పెక్టర్లు, అగ్నిమాపక శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కాంప్లెక్స్ పై అంతస్తులో ఉన్న ఇద్దరిని పోలీసులు రక్షించారు. ఎవరికీ ఎలాంటి హాని జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

ASTROLOGY

★ శివశక్తి జ్యోతిస్థాలయం: పేరు, చేతిరేఖలు, ముఖం చూసి జ్యోతిషం చెప్పబడును. ప్రేమ, చదువు, ఉద్యోగం, వ్యాపారం, భార్యాభర్తల సమస్యలు, ఎటువంటి సమస్యలైనా 11 రోజులలో పరిష్కారం చూపబడును. చైతన్యపురి: 7993422886. NT-326025

ఓం శివదుర్గా జ్యోతిష్యం

★ వీరు శివదుర్గ దైవశక్తితో కేరళ సమాధి జపం సర్వమంత్ర సిద్ధి పొంది వున్నారు. అఘోర మరియు నాగసాధువులతో కలిసి సాధన పొంది వున్నారు. ఎటువంటి సమస్యలైనా 11 రోజులలో పరిష్కారం, శివం రోడ్. ఫోన్: 9866177085. NT-333815

PACKERS & MOVERS

★ Sri Sai Packers & Movers Local and all over India, Resonable Price. Head Office Nacharam: 27176927, Ameerpet: 9866379391, DSNR: 9666993927, KKP: 9949513929, MP: 9848263927, ECIL: 9666983927. NT-334246

WATER PROOFING

★ సాయి బాలాజీ వాటర్ ప్రూఫింగ్: బిల్డింగ్, స్లాబ్, బాత్‌రూం, సైడ్‌వాల్స్, వాటర్ ట్యాంక్, సంప్, ఎనీ లీకేజ్, బ్రాండెడ్ కెమికల్స్‌తో, 10 సం।। గ్యారంటీతో చేయబడును. Ph: 9121195558. NT-326018

GOLD FINANCE

★ మీ బంగారం బ్యాంకుల్లోగానీ, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. Ph: 9100329739. NT-334237

CHITS

★ కపిల్ చిట్స్ (Since 44 Years)లో 10, 25, 30 లక్షలు, 50 లక్షలు & 1 కోటి రూపాయల చిట్స్ కలవు. వేకెంట్ చిట్స్ కలవు. ఫోన్: 8464919899. NT-333891

HOME TUITIONS

★ Walk-in-Interview for Home Tutors, School Teachers, Lecturers all Subjects @ Uppal Zone, Part Time/Full Time. DESU Educational Academy. 9701004500. NT-339521

OLD AGE HOME

★ వృద్ధులు & భార్యాభర్తలు A/c & N/C అటాచ్డ్ బాత్‌రూం, మేడిపల్లి/ఉప్పల్, వృద్ధులు, బెడ్ పేషెంట్లు, ECIL, చీర్యాల్ 'X' రోడ్, భోజన వసతి, 24/7 మెడికల్ సర్వీస్. Ph: 7981467036, 9391039990, 9515474083. NT-333820

TOURS & TRAVELS

★ మహాదేవ టూర్స్: 7 జులై-అమరనాథ్ + నవదేవి, 20 సెప్టెంబర్-చార్‌ధామ్, 5 అక్టోబర్ మరియు 6 నవంబర్-కాశీయాత్ర, 10 డిసెంబర్-రామేశ్వరం @ 9908844377. NT-339527

PLOT FOR SALE

★ వరంగల్ హైవే, భువనగిరి బైపాస్ ఆనుకుని వివేరా హోటల్‌కి అతి సమీపంలో HMDA అప్రూవ్డ్ విల్లా ఓపెన్ ప్లాట్స్ కలవు. ఆల్ డెవలప్‌మెంట్స్, Spot రిజిస్ట్రేషన్, Bank Loan available. Ph: 9989032598. NT-3959

★ VIJ హైవేకు చౌటుప్పల్ మున్సిపాలిటీలో 50 ఎకరాల HMDA & RERA ప్లాట్లు కలవు & ఇబ్రహీంపట్నం టౌన్‌కి దగ్గరలో BDL కంపెనీ ప్రక్కన 100 ఫీట్స్ రోడ్‌కు ప్లాట్లు కలవు. Ph: 9989032598. NT-333858

★ బిగ్ వెంచర్ 75 ఎకరా గేటెడ్ కమ్యూనిటీ రిసార్ట్ ఫామ్ ప్లాట్స్, నియర్ యాదాద్రి ఆలేర్ ఓన్లీ 6 లాక్స్ ఫామ్‌ప్లాట్స్ రిసార్ట్ మెంబర్‌షిప్ ఫ్రీ. 6304274859. NT-339533

PLOT FOR SALE

★ షాద్‌నగర్ @ కేశంపేట టౌన్‌లో DTCP లేఅవుట్‌లో ఫుల్ డెవలప్‌మెంట్స్‌తో 0% ఇంట్రెస్ట్‌తో 40 EMI పద్ధతిలో ఓపెన్ ప్లాట్స్ కలవు. డైరెక్ట్ కంపెనీ ఆఫర్, సైట్ వి